క్లుప్తంగా

అందరూ ఓటు వేసేలా చైతన్యపరచాలి

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరూ ఓటు వేసేలా చైతన్యం కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్ల ప్రతినిధులకు సూచించారు. ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో వారితో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు ప్రతి ఓటూ అత్యంత కీలకమనే అంశంపై సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్ల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఇందుకు అనుగుణంగా వీడియోలు రూపొందించాలన్నారు. సమావేశంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారులు పి.విజయ భాస్కర్, ఎం భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



రామకంచిరాజనగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: సంక్షేమ పథకాలు కొనసాగించాలన్నా, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నా సీఎం జగన్‌కే సాధ్యమని, అటువంటి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీటీసీ మద్దూరి భవాని తదితరులు ఓటర్లను కలసి ఐదేళ్లలో ప్రజలకు జరిగిన మంచిని వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, బైలపాటి నూకరాజు, నాగల బాలాజీ పాల్గొన్నారు. విజయరాయుడుపాలెంలో సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొండా చంటిబాబు, జేసీఎస్ కాదా వెంకటేశ్వరరావు, ఎస్సీ నాయకులు సుధీర్, ఎం.అప్పారావు, జి.రవికుమార్, బూలా నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ పి.పుల్లేశ్వరరావు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమానికి వితరణ



పెద్దాపురంలోని ఆశ్రమానికి భోజనం నిమిత్తం సహకారం అందిస్తున్న విలియమ్స్

కాకినాడ రూరల్: పెద్దాపురంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమానికి భోజన నిమిత్తం కాకినాడ రూరల్ రాయుడుపాలెంలోని విలియమ్స్ చారిటబుల్ సొసైటీ మంగళవారం నగదుతో పాటు పండ్లు, వస్త్రాలను అందజేసింది. సంస్థ వ్యవస్థాపకుడు స్టీఫెన్ ఆనంద్, సీటీసీ వ్యవస్థాపకుడు యం.ఎస్. విలియమ్స్ ఈ మేరకు ఆశ్రమ నిర్వాహకుడు చందుకు సాయాన్ని అందజేశారు.

అంకితభావంతో పనిచేస్తే ఉన్నత స్థానం



పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

కాకినాడ లీగల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ పేర్కొన్నారు. ఇటీవల బదిలీల్లో భాగంగా కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావును కడప జిల్లా ఒకటో అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావును కాకినాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీలు ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం బార్ సభ్యులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. న్యాయమూర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు వేగంగా పరిష్కరించడం ద్వారా గుర్తింపు వస్తుందన్నారు. సన్మాన కార్యక్రమానికి ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సత్య ధ్యాన తీర్థ ఆరాధన

బోట్‌క్లబ్: ఉత్తరాది మఠాధికారి దివంగత సత్య ధ్యాన తీర్థ స్వామీజీ ఆరాధన ఉత్సవాలు స్థానిక రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో మంగళవారం మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్వేష్ మాట్లాడుతూ ఇటీవల కాకినాడ మధ్వ సభ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బృహతి సహస్ర యాగం విజయవంతం కావడానికి గురువుల అనుగ్రహమే కారణమన్నారు. పండిత వాసుదేవాచార్, విజయ సింహాచార్ మన ప్రాంతంలో ఉండడం మన అదృష్టమన్నారు.

మత్స్యకారులకు మరింత మేలు చేస్తా



దుమ్ములపేట ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



భర్త ద్వారంపూడికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న మహాలక్ష్మి

- గ్రామాన్ని దత్తత తీసుకున్న కొండబాబు దగా చేశారు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- దుమ్ములపేటలో ఎన్నికల ప్రచారం

కాకినాడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా మత్స్యకారులు నివసించే దుమ్ములపేట ప్రాంతంలో వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి అపూర్వస్వాగతం లభించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పదో డివిజన్ దుమ్ములపేట దుర్గగుడి నుంచి ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఇంటింట ప్రచారం చేశారు. మైదువారివీధి, రామాలయంవీధి, మోసావారివీధి, మున్సిపల్ పాఠశాల రోడ్ల మీదుగా ఆయన ప్రచారాన్ని కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన ఐదేళ్లలో దుమ్ములపేట ప్రాంతానికి చేసిన అభివృద్ధిని అక్కడి మత్స్యకారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తన హయాంలో దుమ్ములపేటను దత్తత తీసుకున్నప్పటికీ ఏనాడూ కన్నెత్తి చూడలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. సముద్రవేటనే జీవనాధారం చేసుకుని జీవించే మత్స్యకార ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. దాదాపు రూ.11 కోట్లతో అనేక ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీల వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ముఖ్యంగా వైద్యసేవల కోసం దూరప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితుల్లో స్థానికంగానే సీఎస్సార్ నిధులతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా నెలకొల్పామన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి గెలిపిస్తే మత్స్యకారులకు అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వాసుపల్లి కృష్ణ, ఎరుపల్లి సీతారామ్, వాసుపల్లి రాంబాబు, పేర్ల దుర్గారావు, ఎరిపల్లి సత్యం, తిరిది జగన్నాథం, వాసుపల్లి అప్పారావు, తిరిది సత్యంతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారంపూడి సతీమణి ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి స్థానిక 5వ డివిజన్ పేర్రాజుపేట వినాయకుని గుడి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రజాసేవకే అంకితమై ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన తన భర్త ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేడిశెట్టి రమణ, శ్రీధర్, అనిల్, మాచారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితర నేతలు ఆమె వెంట ఉన్నారు.

చేసిన అభివృద్ధే విజయానికి సోపానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ తదితరులు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, ద్వారంపూడి
- డి కన్వెన్షన్‌లో నాయకులు, రాజీనామా చేసిన వలంటీర్లతో సమావేశం

కాకినాడ: గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమమే రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సోపానమని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక డి కన్వెన్షన్‌లో 14–26, 38–46 డివిజన్ల పరిధిలోని 2, 4 క్లస్టర్ల పార్టీ నేతలు, రాజీనామా చేసిన వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాలను అందించామన్నారు. సిటీ పరిధిలో 30 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వడం ఓ రికార్డుగా పేర్కొన్నారు. నగరంలో 92 వేల గృహాలు ఉంటే, 84 వేల ఇళ్లకు ప్రభుత్వ పథకాలు అందాయని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతీ గడపకు వెళ్లి వివరించాలని వారికి పిలుపునిచ్చారు. అదే సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ అనైతిక కూటమి చేసే దుష్ప్రచారాలను కూడా సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. బూత్‌స్థాయిలో టీడీపీ కన్నా మెరుగైన వ్యవస్థ, కేడర్ వైఎస్సార్ సీపీకి ఉందని, ప్రతి ఒక్కరూ కష్టించి పనిచేస్తే మంచి మెజార్టీతో విజయం సాధించగలమన్నారు. ప్రతి ఒక్కరి అంతిమ లక్ష్యం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా చేయడమేనన్నారు. ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు గుబ్బల తులసీకుమార్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి సత్యప్రసాద్, ఆయా క్లస్టర్ ఇన్‌చార్జిలు, ఎంజీకే కిశోర్, బాలాప్రసాద్, రాగిరెడ్డి కన్నా, ఇనుకొండ పట్టాభిరామయ్య, మాజీ కార్పొరేటర్లు కొలగాని దుర్గాప్రసాద్, కర్రి శైలజ, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు రేపు అంతరాయం

కాకినాడ: కాకినాడ శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ పరిధిలో లీకేజీలకు గురైన తాగునీటి పైపులను మరమ్మతులు చేస్తున్న క్రమంలో గురువారం సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎస్ఈ పి.సత్యకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఫిల్టరేషన్‌ప్లాంట్ పరిధిలోని తాగునీటిని సరఫరా చేసే శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ, శ్రీనివాస బ్యాంక్‌కాలనీ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. 19వ తేదీ ఉదయం నుంచి తాగునీరు యథావిధిగా సరఫరా అవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ముందస్తుగా నీటిని నిల్వచేసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఇందుకోసం 96767 70461, 98484 71415, 63013 87834 మొబైల్ నంబర్లను సంప్రదించవచ్చునని ఎస్ఈ ఆ ప్రకటనలో తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

కాకినాడ సిటీ: జనజాగరణ వేదిక ఆధ్వర్యంలో మన దేశం–ధర్మం, రాష్ట్రం కోసం మన ఓటు కరపత్రాన్ని కాకినాడ ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆర్ఎస్ఎస్ ప్రాంత సామాజిక సమరసత సహ సంయోజక్ రాజా రామచంద్ర ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కరపత్రంలో ఎవరికి ఓటెయ్యాలి, ఎలాంటి వారికి ఓటు వేయాలి అనే వివరాలను స్పష్టంగా తెలియజేసినట్లు రామచంద్ర తెలిపారు. కార్యక్రమంలో నగర నాయకులు బాలాజీ, రవి, రామచంద్రరావు, సత్యప్రసాద్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం చూతమురారండి

- శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధం
- ఆలయాల్లో భారీ ఏర్పాట్లు చేసిన కమిటీలు



మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లను వధూవరులుగా ముస్తాబు చేస్తున్న ఆలయ అర్చకులు

బోట్‌క్లబ్: శ్రీరామ నవమి వేడుకలకు నగరంలోని రామాలయాలు సిద్ధమయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కల్యాణాలు సంతృప్తిగా తిలకించేలా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు మజ్జిగ, తాగునీటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాయి. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా ముస్తాబు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ యార్రా వేంకటేశ్వరరావు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ నెల 19న ఆలయంలో శ్రీదేవి సమేత వేంకటేశ్వర కల్యాణం వైభవంగా జరుగుతుందన్నారు. అనంతరం సీతారాముల వారి సదస్యం జరుగుతుందన్నారు. 23న శేషహోమం, పూర్ణాహుతి, చక్రతీర్థోత్సవం, 24న శ్రీపుష్పయాగోత్సవం, 30న సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం జరుగుతాయన్నారు. స్థానిక టూటౌన్ సమీపంలో ఉన్న సీతారామస్వామి ఆలయంలో నవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. స్థానిక బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న సీతారామచంద్రమూర్తి ఆలయంలో నవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారిని, అమ్మవారిని వధూవరులుగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పైండా రామకృష్ణారావు పాల్గొన్నారు. స్థానిక రామారావుపేట శివాలయం ప్రాంగణంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న రాముల వారి ఆలయాల్లో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

నాటక కళాకారులకు సత్కారం

కాకినాడ రూరల్: తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నాటక కళాకారులు అన్నెపు దక్షిణామూర్తి, పల్లా బాబూరావులను అడబాల రత్నప్రసాద్, నాగేశ్వరరావు, రాజా, భాను, రాఘవరావు తదితరులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తమ కళాకారుడు దక్షిణామూర్తి మాట్లాడుతూ సమాజంలో సమస్యలు, వాటి పరిష్కారాన్ని చూపెట్టే నాటకాలు సమాజ చైతన్యానికి స్ఫూర్తి అన్నారు.

ప్రచండ ప్రకోపం @ 42



కరపలో నిర్మానుష్యంగా ఉన్న మండల పరిషత్-తహసీల్దార్ కార్యాలయం రోడ్డు

కరప: ప్రచండ భానుడు ప్రకోపం 42 డిగ్రీలకు చేరిపోయింది. ఆయన తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే కర్తర్లు మొదలైతే ఇంకెలా ఉంటుందో అని భయపడుతున్నారు. గ్రామంలో మధ్యాహ్నం నుంచి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి తీవ్రతకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సి వస్తోందంటున్నారు. ఐదు గంటలకు కూడా సూర్యుని భగభగలు తగ్గడంలేదు. ప్రజలు ఉష్ణ తాపానికి శీతలపానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల వ్యాపారస్తులు మధ్యాహ్న సమయంలో దుకాణాలు మూసివేసి సాయంత్రం తెరుస్తున్నారు.

ఉపాధి పనికి వెళుతూ

వృద్ధురాలి మృతి



సర్పవరంలో కుప్పకూలి మృతి చెందిన సీత

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు బొండాడ సీత (59) ఉపాధి హామీ పనులకు మంగళవారం ఉదయం వెళుతూ కుప్పకూలి మృతి చెందింది. గ్రామస్తులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గణేష్ వివరాల ప్రకారం గ్రామంలోని శివాలయం సమీపంలో సచివాలయం –4 పరిధిలో ఉపాధి హామీ పథకం కింద కాలువ పూడికతీత పనులు చేపడుతున్నారు. పనుల్లో పాల్గొనేందుకు ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన సీత మార్గంలోనే కుప్ప కూలి పడిపోయి మృతి చెందింది. ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం నుంచి పరిహారానికి ప్రతిపాదనలు పంపుతున్నట్టు టీఏ గణేష్ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎం, వీవీ ప్యాట్‌లు

పర్యవేక్షించిన ఈఆర్వో వెంకటరావు



ఈవీఎం, వీవీ ప్యాట్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌కు రాజకీయ పార్టీల నేతల సమక్షంలో సీలు వేస్తున్న అధికారులు

కాకినాడ: సిటీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లను మంగళవారం మెక్లారిన్ స్కూల్ ఆవరణలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఉన్న తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లను తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి సీల్ వేశారు. సిటీ నియోజకవర్గానికి సంబంధించి 281 కంట్రోల్ యూనిట్లు, 281 బ్యాలెట్ యూనిట్లు, సుమారు 305 వీవీ ప్యాట్‌లు ఇక్కడకు కేటాయించారు. ఇదే సంఖ్య పార్లమెంట్ అభ్యర్థికి సంబంధించి కూడా వచ్చినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. పటిష్టభద్రతతో వీటిని తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లో పెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, డిప్యూటీ తహసీల్దార్లు నాయుడు, సీహెచ్ అనిల్‌కుమార్, పవన్, ఆర్ఐ దీపక్‌తో పాటు ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశీలకుల వసతి ఏర్పాట్లు పరిశీలన

త్వరలోనే కేంద్ర పరిశీలకులు ఇక్కడకు రానున్నారని రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. వీరు బస చేసేందుకు రామ్‌కోస భవనంలో వసతి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి అక్కడ కల్పిస్తున్న సదుపాయాలను, వసతి ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఏఈ రమేష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన శిక్షణ

కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో అదర్ పోలింగ్ ఆఫీసర్స్ (ఓపీవో)లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. రెండు రోజుల్లో దాదాపు 2,400 ఓపీవోలకు శిక్షణ ఇచ్చారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి ఎన్నికల విధులపై ఓపీవోలకు సూచనలు ఇచ్చారు. పోలింగ్ సందర్భంగా చేపట్టాల్సిన విధులు, సాంకేతిక, చట్టపరమైన అంశాలు, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన రాజేశ్వరరావు తదితరులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన
- వాకలపూడిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం



కాకినాడ రూరల్ వాకలపూడి ఫిషర్‌మెన్ కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని వాకలపూడిలో మంగళవారం సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. గ్రామంలో సచివాలయం – 1 పరిధిలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద దర్శనం అనంతరంగా ఫిషర్‌మెన్ కాలనీ, ఫిషర్‌మెన్ పేట, బీసీ కాలనీ, ఎస్సీపేట తదితర ప్రాంతాలలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి ఓటును అభ్యర్థించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి ప్రభుత్వం నుంచి జరిగిన మేలును వాకబు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల పాటు పేదల పక్షపాతిగా సీఎం జగన్ పాలన అందించారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి లబ్ధి జరిగిందన్నారు. ఎన్నికల కోసం కూటమిగా వచ్చే వారిని నమ్మవద్దన్నారు. సీఎం జగన్‌కు మరో సారి అవకాశం ఇచ్చేందుకు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గోపుశెట్టి బాబ్జీ, గంపల సత్యనారాయణ, గొల్లపల్లి కాశీ, దాసరి జగన్, నల్ల శ్రీను, భవాని, కరీం బాషా, విజయసారథి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీసీ సంఘ నేత

మండలంలోని ఇంద్రపాలెం గ్రామానికి చెందిన బీసీ సంఘ నేత, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల బీసీ సంఘాల అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, తన అనుచరులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను ఆధ్వర్యంలో రాజేశ్వరరావు, సుమారు 200 మంది అనుచరులు వైఎస్సార్ సీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు వేసిన కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.

మాజీ ఎంపీటీసీ చేరిక

మండలం వాకలపూడి ఫిషర్‌మెన్ పేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మండా సింహాద్రి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

ప్రేక్షకాదరణతోనే నాటకానికి పూర్వ వైభవం

- ప్రముఖ రంగస్థల కళాకారుడు మీగడ రామలింగస్వామి
- ఘనంగా తెలుగు నాటకరంగ దినోత్సవం



మీగడ రామలింగస్వామిని సత్కరిస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని, అందుకోసం కళాకారులు, పరిషత్‌లు కాకుండా సహృదయులైన ప్రేక్షకులు ముందుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వ ఎన్టీఆర్ రంగస్థల పురస్కార గ్రహీత మీగడ రామలింగస్వామి అన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవాలను మంగళవారం సాయంత్రం ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో దంటు కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరస్వతి గానసభ అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి, విశిష్ట అతిథిగా డాక్టర్ చెలికాని స్టాలిన్ తదితరులు హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ తెలుగు నాటక, కళారంగానికి హ్యాపీ క్లబ్ చేస్తున్న సేవలు మరువ రానివన్నారు. ఎందరో రంగస్థల, సినీ, టీవీ కళాకారులకు పుట్టినిల్లుగా క్లబ్ నిలిచిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ రంగస్థల పురస్కార గ్రహీత మీగడ రామలింగస్వామికి దంటు సూర్యారావు స్మారక జీవితకాల పురస్కారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సంస్థ ఆధ్వర్యంలో తనకు లభించిన పురస్కారం కళారంగానికి సేవ చేయాలన్న తపనను మరింత పెంచిందన్నారు. క్లబ్ కళాసేవను కొనియాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు కపిరాజు నాటిక ప్రదర్శించారు. రామాయణ, మహాభారతాల్లో అన్నదమ్ముల కథలు ప్రసిద్ధం. కపిరాజు నాటికలో వాలి, సుగ్రీవుల మధ్య అధికారం చిచ్చుపెట్టి, బ్రష్టులుగా నిలబెట్టిందనే ఇతివృత్తాన్ని నేటి కాలానికి అన్వయిస్తూ కథనం సాగింది. రచన, దర్శకత్వం ఎంఎస్ చౌదరి చేశారు. నాటిక అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి పీవీ రావు, కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాసు, పట్నాల రామచంద్రరావు, సీతారామ్, ఎం.విశ్వేశ్వరరావు, క్లబ్ సభ్యులు తదితరులతో పాటు పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి

కాకినాడ రూరల్: గొప్ప సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞశాలి, నవయుగ వైతాళికుడు కందుకూరి విరేశలింగం పంతులు అని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. కందుకూరి విరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద ఆయన విగ్రహానికి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో కందుకూరి జన్మించారని, స్త్రీ విద్యపై ఉద్యమించి బాలికలకు పాఠశాలలను ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో బ్రహ్మసమాజం, హితకారిణి సమాజం స్థాపించి తన ఆస్తిని దానం చేశారన్నారు.